క్లుప్తంగా

భక్తుల చెంతకు కనకదుర్గమ్మ



అడవిపాలెంలో అమ్మవారి ఘటాలకు హారతులిస్తున్న మహిళ

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెంలో నిర్వహించే గ్రామదేవత కనకదుర్గమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆసాదులు అమ్మవారి ఘటాలను తలపై ఎత్తుకుని మంగళ వాయిద్యాల నడుమ భక్తుల చెంతకు వెళుతున్నారు. తమ ఇళ్లకు వచ్చిన ఘటాలకు భక్తులు పసుపు నీళ్లతో అమ్మవారి పాదాలు కడిగి, కొబ్బరికాయలు, అరటి పండ్లు నైవేద్యంగా సమర్పిస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని గాంధీ, పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు, అడబాల రాజేష్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: వేములదీవి పడమర పంచాయతీ కాపుల కొడపలోని వేంకటేశ్వర స్వామి వారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నుంచి స్వామివారికి గ్రామోత్సవం, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ప్రతి నెల సంకట హర చతుర్థి సందర్భంగా ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో 16 మంది దంపతులు పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, మహిళలకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అర్చకులు అనిల్, వీరబాబు పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

నరసాపురం: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 18వతేదీ శనివారం నరసాపురం కోర్టు వద్ద ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. కుటుంబ తగాదా కేసులు, వినయోగదారుల హక్కుల కేసులు, మేధోసంపత్తి హక్కుల కేసులు రాజీ చేస్తామని చెప్పారు. కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

19న రాష్ట్రస్థాయి యోగా పోటీలు

నరసాపురం: నరసాపురం అల్లూరి సత్యనారాయణరాజు కల్యాణ మండపంలో ఈనెల 19న రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్ చెప్పారు. శనివారం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో వివరాలు వెల్లడించారు. 8 నుంచి 80 ఏళ్ల వరకూ వయస్సు కలిగినవారు పాల్గొనవచ్చని చెప్పారు. సుమారు 100 మంది వరకూ ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో కోట్ల రామ్‌కుమార్, నూలి శ్రీనివాస్, యోగా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కె.పాండురంగారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థం.. ఆరోగ్యానికి హాని

- పర్యావరణానికి విఘాతంగా ప్లాస్టిక్ వ్యర్థాలు
- ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించలేకపోతున్న అధికారులు
- ప్రచారానికే పరిమితమవుతున్న హెచ్చరికలు

పాలకొల్లు సెంట్రల్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు, అధికారులు హెచ్చరిస్తున్నా ప్రజలు వాటిని పెడచెవిన పెడుతున్నారు. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అనేక అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నా, అపరాధ రుసుములు వేస్తున్నా వ్యాపారులు నిర్లక్ష్య ధోరణి విడనాడడంలేదు. మునిసిపల్ అధికారులు కొద్ది రోజులు కఠినంగా వ్యవహరిస్తుంటే వ్యాపారులు ఓ పదిరోజులు కవర్లు వాడకం తగ్గించి మళ్లీ యథాతథంగా వినియోగిస్తున్నారు. కవర్ లేదంటే వినియోగదారులు మా వద్దకు రావడం లేదని వ్యాపారస్తులు సాకులు చెబుతున్నారు. మునిసిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటే వ్యాపారులు భయంతోనైనా ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తారని, లేదంటే కవర్లు వినియోగం ఇంకా పెరిగిపోతుందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతిందని వర్షం వస్తే డ్రైనేజీల్లో మురుగునీరు ప్రవహించని దుస్థితి నెలకొంటోంది. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. ఇలాగే కొనసాగితే ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి, భూగర్భ జలాలకు మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా డ్రెయిన్లలో మురుగునీరు కదలని దుస్థితి (ఫైల్ ఫొటో)



వేడి సాంబారు, కూరలు పాలిథిన్ కవర్లలోనే ప్యాకింగ్

వినియోగదారుని నిర్లక్ష్యమే ప్రధాన కారణం

మార్కెట్లో ప్లాస్టిక్ కవర్లు అతి చౌకగా దొరుకుతున్నాయని వినియోగిస్తున్నారు. వాటితో అతి త్వరగా ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నామని మాత్రం ఎవ్వరూ గ్రహించలేకపోతున్నారు. మొన్నటి వరకూ కిరాణా, కాయగూరలు, కూరలు, మందులు, స్వీట్లు, పండ్లు వంటివి కవర్లలో పార్శిల్ చేసేవారు. నేడు వేడిగా ఉన్న టీ, కాఫీ, సాంబారు కూడా కవర్లలో పార్శిల్ చేస్తున్నారు. వేడికి కవర్లు కరిగి పదార్థాల్లో కలవడంతో అవే తినడం, తాగడం వల్ల అనేక మంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.

పట్టణంలో రోజుకు 40 టన్నుల చెత్త సేకరణ

పట్టణాన్ని 35వార్డులుగా విభజించారు. ప్రస్తుత జనాభా సుమారు లక్షపైనే ఉన్నారు. పట్టణంలో రోజుకు దాదాపుగా 40టన్నులు చెత్త సేకరిస్తున్నారు. పట్టణ జనాభాతో పాటు వివిధ అవసరాలు, ఉపాధి కోసం వస్తూ వెళ్లే జనాభాతో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. ప్లాస్టిక్ సంచులతోపాటు ప్లాస్టిక్ గ్లాసులు వినియోగం ఎక్కువగాఉంది. ఫంక్షన్లలో వాడిన గ్లాసులు, కవర్లు ఎక్కడికక్కడే రోడ్డుపై వేయడంతో గాలికిఎగిరి అవి డ్రైనేజీలోకిచేరి మురుగునీటి పారుదల కాకుండా అడ్డుపడుతున్నాయి.

ఏప్రిల్ 1 నుంచి తనిఖీలు ముమ్మరం



వ్యాపారులకు ప్లాస్టిక్ వాడకంపై హెచ్చరికలు చేస్తున్నాం. ప్రతి బుధవారం శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు దొరికితే వ్యాపారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకూ వ్యాపారులు, ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ 1 నుంచి తనిఖీలు ముమ్మరం చేసి కవర్లు కనిపిస్తే అపరాధ రుసుము భారీగా వేస్తామని హెచ్చరించారు. 40 మైక్రాన్స్ లోపు ఉన్న ప్లాస్టిక్‌ను వాడరాదని సూచిస్తున్నాం.

– టీఆర్ఎస్ శేషాద్రి,
మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ ఇన్‌చార్జ్, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9గంటలకు వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ, కేక్ కటింగ్‌తో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు పెనుగొండలో

పెనుగొండ: వైఎస్సార్ సీపీ 12వ ఆవిర్భావ వార్షికోత్సవం పెనుగొండలో ఆదివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి(బాబిరెడ్డి) తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం డాక్టర్ వైఎస్సార్ కూడలిలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముగిసిన దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాసరావు, చంద్రావతి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు యడ్లబజారులో దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, చంద్రావతి దంపతులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కల్యాణోత్సవాలు నిర్వహించిన దాసిరెడ్డి శ్రీనివాసరావు, కుమార శ్రీవరలక్ష్మి దంపతులు ముత్తైదువలకు పసుపు, కుంకుమ, ప్రసాదాలు పంపిణీ చేశారు. చైర్మన్ దంపతులను సత్కరించినవారిలో క్షీరారామలింగేశ్వరస్వామి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, అష్టభుజలక్ష్మీనారాయణ స్వామి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గాదె వెంకన్న, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీలు రేలంగి నరసింహారావు (దున్ను), నుదురుపాటి శ్రీనివాసరావు, కెల్లా పెద్దిరాజు, కెల్లా దుర్గారావు, గుండుబోయిన అరుణకుమారి, గుండుబోయిన నాగేశ్వరరావు ఈవో ఎస్ సతీష్‌కుమార్, సిబ్బంది సీహెచ్ రాంబాబు, కె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువజన కమిటీలను బలోపేతం చేయాలి



శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: జిల్లా అంతటా విస్తృతంగా పర్యటించి జిల్లా కమిటీలను బలోపేతం చేసి ఎక్కువ మంది యువజనులతో వైసీపీని బలపరిచేందుకు కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కోరారు. వైఎస్సార్ సీపీ యువజన కమిటీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన కుంచిలపల్లి వినిస్టన్‌బాబు శనివారం భీమవరంలో శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. వినిస్టబన్‌బాబుతో పాటు కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ సోడదాసి అశోక్‌కుమార్, యువజన నాయకులు దేవ రాజేష్ కుమార్ తదితరులున్నారు.

ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు



రైల్వేస్టేషన్ రోడ్డులో ఇరువైపులా నిలిపిన ప్రైవేట్ వాహనాలు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వేస్టేషన్‌రోడ్డులో ఇటీవల రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్డు విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలామంది ప్రత్యామ్నాయంగా, ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నారు. ఇటీవల స్టేషన్ పక్క నుంచి సరిపల్లి మీదుగా బైపాస్ నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. ఈ రోడ్డులో ప్రైవేట్ బస్సులు, ఆక్వా కంపెనీలకు చెందిన ఇతర వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. బస్సులను ఇక్కడే శుభ్రం చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన బురదమయంగా ఉంటోంది. రోడ్ మార్జిన్లు పాడైపోతున్నాయి. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యపై 1వ వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ నిలదీశారు. ప్రైవేట్ బస్సులు నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, ఈరోడ్డులో సమస్య పరిష్కారమయ్యేలా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలకు హాజరైన విద్యార్థులు

నరసాపురం: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని నరసాపురం ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ జి. జేసుప్రసాద్ సూచించారు. అడలిసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్ ద్వారా శనివారం నరసాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పట్టణానికి చెందిన శ్రీ కస్తూరీబా స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 45 మంది విద్యార్థులకు బీపీ, సుగర్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసుప్రసాద్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు నేరుగా ప్రభుత్వాసుపత్రికి వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుమన్, డాక్టర్ ప్రియాంక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేగులమ్మ జాతర



వడ్లవానిపాలెం గ్రామదేవత వేగులమ్మ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం వడ్లవానిపాలెంలో వేగులమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. పాత పంచాయతీ సెంటర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి ఊయల సేవ నిర్వహించి అనంతరం గుడిలోకి సాగనంపారు. జాతర సందర్భంగా గ్రామేతర ప్రాంతాల నుంచి ఆడబడుచులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పెన్మెత్స సాయిరాజు, సర్పంచ్ పెన్మెత్స పద్మ, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, గ్రామ పెద్దలు అల్లం బుజ్జి, తమ్మినీడి వెంకటేశ్వరరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుంతీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కుంతీ లక్ష్మీనరసింహస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యలమంచిలి: కొంతేరులోని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం దేవేరులకు మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్, ములుగు లక్ష్మీ చరణ్ ఆధ్వర్యంలో పాలమూరు మాధవాచార్యులు ఈ కల్యాణం నిర్వహించారు. పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీరామచంద్రమూర్తి, శ్రీదేవి దంపతులు పీటలపై కూర్చుని ఈ కల్యాణం చేశారు.



















